8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

కొత్తచెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షను డిసెంబరు 8న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టిక్కెట్‌ను ప్రభుత్వ వెబ్‌సైట్ www.dse.ap.gov.inలో, స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఆయా హెచ్‌ఎంలు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి, విద్యార్థులకు హాల్‌టిక్కెట్లను అందజేయాలని సూచించారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

84 గ్రాముల బంగారం,
2.173 కేజీల వెండి,
లక్ష నగదు స్వాధీనం
7



ఏంటో ఈ విడ్డూరం..!

మూతపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు
కొనుగోలు బాధ్యతలు
మద్దతు ధర లేక నష్టపోతున్న
వేరుశనగ రైతులు
6



స్టాంపు కష్టాలకు చెక్..!

కూటమి సర్కారు నూతన విధానం
ఆధార్ తప్పనిసరి చేస్తూ నిర్ణయం
కృత్రిమ కొరత, నకిలీలకు అడ్డుకట్ట
వేయడమే లక్ష్యం
7



తాకట్టులో.. రైతు కష్టం..!



పాతాళానికి వక్క ధరలు



ఈయన పేరు హనుమంతరాయప్ప. అమరాపురం మండలం మద్దనకుంట గ్రామ రైతు. ఏడెకరాల్లో వక్క సాగు చేశాడు. గతేడాది 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈసారి ఎండలు అధికంగా ఉండడంతో 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దానికి కూడా గిట్టుబాటు ధరలు లేవు. దీంతో కర్ణాటకలోని లింగదహళ్లి సొసైటీలో 40 క్వింటాళ్ల వక్కను తాకట్టు పెట్టి రూ.12 లక్షల వరకు రుణం తీసుకున్నాడు. రూ.1.75 చొప్పున వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

- కొనేవారు కరువు
- దెబ్బకొడుతున్న దిగుమతులు
- ఇళ్లలోనే నిల్వ చేసుకున్న రైతులు
- కర్ణాటక బ్యాంకుల్లో తాకట్టు

వక్క రైతుకు అన్నీ కష్టాలే. ఈ ఏడాది దిగుబడి తగ్గిపోయింది. అంతో.. ఇంతో.. పండిన పంటకు ధర కూడా లేకపోయింది. కొనేవారే కరువయ్యారు. దీంతో పంట దిగుబడిని ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. కొందరు రైతులు కర్ణాటక బ్యాంకుల్లో పంట దిగుబడిని తాకట్టు పెట్టి, రుణాలు తీసుకున్నారు. విదేశాల నుంచి దిగుమతులు వెల్లువలా వచ్చి పడుతుండడంతో స్థానికంగా పండించిన పంటకు గిట్టుబాటు ధర కరువైంది. మడకశిర ప్రాంతంలో వేల క్వింటాళ్లలో దిగుబడి వచ్చినా.. కనీసం మార్కెట్ యార్డు కూడా లేదు. కర్ణాటకకు వెళ్లాల్సి వస్తోంది. ఇలా.. బయటపడే మార్గంలేక వక్కరైతు దిక్కులు చూస్తున్నాడు. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం స్థానికంగా వక్క మార్కెట్, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి, ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

- మడకశిర (ఆంధ్రజ్యోతి)



ధర లేక ఇళ్ల వద్దే నిల్వ ఉంచుకున్న వక్క దిగుబడి

రూ.100 కోట్లదాకా లావాదేవీలు

నియజకవర్గంలో దాదాపు 15వేల ఎకరాల్లో రైతులు వక్క పంట సాగుచేశారు. సంవత్సరానికి నియోజకవర్గంలో రూ.100కోట్ల దాకా వక్క లావాదేవీలు జరుగుతాయి. ఒకసారి పంట పెడితే వంద సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తుంది. గతేడాది దిగుబడి బాగున్నా.. ధరల్లేక వక్క రైతులు నష్టాలపాలయ్యారు. ఈసారి దిగుబడీ లేదు, ధరా లేదు. దీంతో ఇళ్లలోనే నిల్వ ఉంచుకుంటున్నారు. అమరాపురం మండలంలోని గౌడనహళ్ళి, నాగోనహళ్ళి, తమ్మడేపల్లి, దేవగానిపల్లి గ్రామాల్లోనే 2వేల టన్నులదాకా వక్క దిగుబడి ఇళ్లలోనే ఉంచుకున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈసారి వక్క దిగుబడి 60శాతం తగ్గింది. వక్క చెట్లకు రెడ్ మ్యాక్స్ తెగులు సోకడంతో దిగుబడి దారుణంగా తగ్గిపోయింది. ఎకరాకు 70 క్వింటాళ్ల దాకా వచ్చే దిగుబడి ఈసారి 20 క్వింటాళ్ల లోపే రావడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర ఎండల కారణంగా వక్క చెట్లలో ఏర్పడిన గొనలు ఎండిపోతున్నాయి. దీంతో దిగుబడి తగ్గిపోతోంది. 35 శాతంలోపే దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఎకరాలో 400 వక్క చెట్లు ఉంటాయి. దిగుబడులు బాగా వస్తే ఎకరాకు 3నుంచి 4 లక్షల రూపాయల దాకా ఆదాయం వస్తుంది. దిగుబడి తగ్గితే ఎకరాకు లక్ష రూపాయాలు కూడా రావడం కష్టమే.

గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం కల్పించాలి



12 ఎకరాల్లో వక్క సాగు చేశా. ఐదెకరాల్లో దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర దక్కట్లేదు. ఏడాదికేడాదికీ వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప.. ధరలు మాత్రం పెరగట్లేదు. దీంతో నష్టం వాటిల్లుతోంది. స్థానికరంగా మార్కెట్ యార్డు లేకపోవడంతో కర్ణాటకకు తరలించాల్సి వస్తోంది. ఇది అదనపు భారం. స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- మంజునాథ్, రైతు, నాగోనహళ్ళి

వైసీపీ పాలనలో అన్యాయం

మడకశిర వక్క రైతులను ఆదుకోవడానికి గత టీడీపీ హయాంలో చర్యలు చేపట్టారు. అమరాపురం సమీపాన వక్క మార్కెట్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. స్థలాన్ని పరిశీలించి, నిధులు మంజూరు చేశారు. గిట్టుబాటు ధరలు లేనపుడు రైతులు పంట దిగుబడిని నిల్వ చేసుకునేందుకు గోదాములు ఏర్పాటు చేశారు. అంతేకాదు, పంట దిగుబడిపై రైతులకు వడ్డీ లేని రుణాలు కూడా మంజూరు చేసింది. ఆరు నెలల వరకు వడ్డీ విధించేవారు కాదు. ఆ తరువాత 9 నెలల పాటు 50 పైసలు వడ్డీ వేసేవారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటన్నింటినీ అటకెక్కించింది. మార్కెట్ యార్డు నిర్మాణం ఊసే ఎత్తలేదు. వడ్డీలేని రుణాలను విస్మరించింది. దీంతో రైతులు నష్టపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మార్కెట్ యార్డు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. వడ్డీ లేని రుణాలిచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి



రెండెకరాల్లో వక్క తోట సాగు చేశా. దిగుబడులు ఆశాజనకంగా వస్తే మూడు నుంచి నాలుగు లక్షల రూపాయల దాకా ఆదాయం వస్తుంది. ఖర్చులు రూ.50 వేలుపోను 2.5లక్షల వరకు మిగులుతుంది. ఈ యేడు దిగుబడులు లేకపోవడంతో ఎకరాకి లక్షరూపాయాలు కూడా రావడం కష్టంగా ఉంది.

- వీరక్యాతప్ప, మద్దనకుంట

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విరివిగా రుణాలు

కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సహికులకు విరివిగా రుణాలు అందేలా చూస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో పరిశ్రమలు, ఎగుమతుల పోత్సాహక కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లడుతూ.. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనేక అవకాశాలున్నాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. అవసరమైన భూములు కేటాయించడంతోపాటు విరివిగా రుణాల మంజూరుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి, అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. వెంటనే అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎపీఐఐసి జోనల్ మేనేజర్ సోనీసహాని, పరిశ్రమల శాఖాధికారి రాజు, ఎల్‌డీఎం రమణకుమార్, డీపీఓ సమత, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాదా, సిల్క్‌డైవలప్‌మెంట్ అధికారి రాజేష్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్ పాల్గొన్నారు.

అలుగు స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న అలుగు

కదిరి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని కుర్లి చెక్‌పోస్టు వద్ద బుధవారం అక్రమంగా తరలిస్తున్న వన్యప్రాణి అలుగును స్వాధీనం చేసుకుని, అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన బాబాఫక్రుద్దీన్‌ను అరెస్టు చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు. అటవీ సెక్షన్ అధికారి రామచంద్రారెడ్డి, బీట్ అధికారులు శ్రీనివాసులు, నరసింహమూర్తి, మహబూబ్ బాషా, శ్రీరాములు తనిఖీలు చేస్తుండగా పులివెందుల వైపు నుంచి బాబాఫక్రుద్దీన్ ద్విచక్రవాహనంలో వచ్చాడు. అతడి వద్ద అలుగు లభించింది. అతడిని అరెస్టు చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.



హుండీని లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

హెంజేరు సిద్దేశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.41 లక్షలు

అమరాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో ప్రసిద్ధిచెందిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గత మూడు నెలలకు మొత్తం రూ.3.41 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ నరసింహరాజు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైసీపీ నేతల లీలలు..!

- తవ్వేకొద్దీ బయటపడుతున్న అక్రమాలు
- బోగస్ పట్టాల వ్యవహారంలో

మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాపై కేసు



వైసీపీ అధినేత జగన్‌తో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా

కదిరి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): బోగస్ పట్టాల బాగోతంలో వైసీపీ నేతల లీలలు ఒక్కొక్కటికి బయటకొస్తున్నాయి. అధికారులు తవ్వేకొద్దీ అక్రమాలు బయట పడుతున్నాయి. ఇప్పటికే కొంతమందిపై పోలీసులు కేసులు పెట్టారు. తాజాగా వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాపై బోగస్ పట్టాల వ్యవహారంలో కేసు నమోదైంది. లోతుగా విచారిస్తే మరెన్నో అక్రమాలు బయటపడే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

తవ్వేకొద్దీ అక్రమాలు

పట్టణంలో బోగస్ పట్టాల వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. కదిరి మండలం సున్నపుగుట్ట తండా పరిధి సర్వే నంబరు 470లో దాదాపు 70 పట్టాలివ్వగా, అందులో 29 మాత్రమే సరైనవిగా అధికారులు తేల్చారు. మిగిలిన బోగస్ పట్టాలు ఆ ప్రాంతానికి చెందిన సోమ్లానాయక్ వద్ద ఉన్నట్లు అధికారులు గుర్తించి, అతడిని అరెస్టు చేశారు.



సున్నపుగుట్ట తండాలో బోగస్ పట్టాలు సృష్టించిన లే అవుట్

అతడి వద్ద 39 బోగస్ పట్టాలున్నట్లు తేలింది. అప్పటి ఆర్ఐ మున్వర్ బాషా, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా తనకు సహకారం అందించినట్లు అతడు పోలీసు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. బోగస్ పట్టాలిచ్చినందుకుగాను ఆర్ఐ మున్వర్‌కు సోమ్లానాయక్ రూ.11లక్షలు ఇచ్చినట్లు పోలీసులు తేల్చారు. ఇందులో సూత్రధారిగా మాజీ ఎమ్మెల్యే ఉన్నట్లు విచారణలో బహిర్గతమైంది. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అత్తార్ చాంద్‌బాషా అనుచరుడైన షామీర్ బాషా నుంచి 301 బోగస్ పట్టాలు, 28 జిరాక్స్ పట్టాలు, 32 పాసుపుస్తకాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో షామీర్ బాషాను సబ్‌జైలుకు పంపారు. ఆర్ఐ మున్వర్‌బాషాపై కూడా కేసు నమోదైంది. దీంతో ఇందులో కూడా చాంద్‌బాషా ప్రమేయం ఉంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్చి ఆస్తుల కేసులో వైసీపీ నాయకుడు మగ్బుల్, పరికి షామీర్, హర్షద్ తదితరులపై కేసు కట్టారు. కేసులు నమోదైన వారిలో కొంతమంది వైసీపీ నాయకులు పరారీలో ఉన్నారు. బోగస్ పట్టాల వ్యవహారంపై లోతుగా విచారిస్తే మరికొన్ని బయటకు వచ్చే అవకాశముందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అడ్డదిడ్డంగా ఎన్‌ఓసీలు, చుక్కల భూములకు పట్టాల పంపిణీ, అసైన్డ్ భూములకు పరిహారం లాంటివి ఎన్నో బయటపడతాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఖరీదైన బైక్‌లే టార్గెట్

- అపహరించడం.. అమ్ముకోవడం..
- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- 31 బైక్‌ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

పావగడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పావగడ, తుమకూరు, చిక్కబళ్లాపుర, బెంగళూరు, అనంతపురం తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగలించి పోలీసులకు సవాలుగా మారిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను పావగడ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 31 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పావగడ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ విజయ్‌కుమార్ బుధవారం వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన హరీష్, బుక్కపట్నం మండలం జానకంపల్లి వాసి సాయిపవన్, మేకలపల్లికి చెందిన మనోహర్ ముఠాగా ఏర్పడ్డారు. పార్క్ చేసిన ఖరీదైన బైక్‌లను అపహరించేవారు. వాటిని విక్రయించి, సొమ్ము చేసుకునేవారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. వాటిని సీరియస్‌గా పరిగణించి, దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో పావగడ పట్టణంలోని రాజవంతి రిలాక్స్ బార్ వద్ద హరీష్‌ను అరెస్టు చేసి, విచారించగా.. చోరీల గుట్టు రట్టయింది. మిగతా ఇద్దరిని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి 6 రాయల్ ఎన్‌ఫీల్డ్, 7 బజాజ్ పల్సర్, రెండు అపాచీ, రెండు ఆర్‌ఎక్స్ 100, రెండు కేటీఎం డూక్, 7 హీరో స్ప్లెండర్స్, మూడు ప్యాషన్ ప్రో, రెండు హోండా షైన్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

మంచుదుప్పటి..



తాడిమర్రి మెయిన్ రోడ్డును కప్పేసిన పొగమంచు

తాడిమర్రిని బుధవారం ఉదయం పొగ మంచు కప్పేసింది. తొమ్మిది గంటలైనా వీడలేదు. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు భయంభయంగా ప్రయాణించాల్సి వచ్చింది.

- ఆంధ్రజ్యోతి, తాడిమర్రి

మామిడి పూత రాకుంటే..

ధర్మవరం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మామిడిలో పూత రాకుంటే పలు మందులు పిచికారీ చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని ఏలుకుంట్ల గ్రామ సమీపాన మామిడి తోటలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడిలో పూత, మొగ్గ రావడానికి 0.52.34 మందును 3 గ్రాములు, సూపర్ కాన్పిడర్ 0.5 ఎంఎల్, ఆగ్రోమిన్ మాక్స్ 3 గ్రాములు, బావిస్టిన్ గ్రాము చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అతర్వాత డిసెంబరు 10వ తేదీలోపు వర్షం రాకపోతే తప్పకుండా చెట్లకు నీరు పెట్టాలన్నారు. నీరు పెట్టేటపుడు లిక్విడ్ సల్ఫర్ నాలుగు లీటర్లు ఎకరానికి డ్రిప్పు ద్వారా పంపాలన్నారు. మందులు పిచికారీ చేసినా పూతలు రాకపోతే డిసెంబరు 15 తర్వాత డబుల్ 1 ఎంఎల్, విపుల్ 3 ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదంటే 10 లీటర్ల నీటికి ప్లానిఫిక్స్ 3 ఎంఎల్, సైటోజైమ్ 20ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట కాపు వచ్చేవరకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు.. అధికారుల సలహాలు తీసుకుంటూ జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి అమరేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

● పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్

అనంతపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకంలో భాగంగా శుక్రవారం నుంచి నిర్వహించే ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తారన్నారు. ఈ సర్వే కోసం ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి వచ్చే ఏడాది జనవరి నెలాఖరు దాకా గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వే చేస్తారన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లో అన్ని ఎంఎస్ఎంఈల సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్ ఫాంలోకి తీసుకొచ్చి, ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారని వెల్లడించారు. ఇందులో నమోదు కాని వ్యాపారాలను ఉద్యం, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేయడం ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్ ముఖ్యుద్దేశ్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎంఎస్ఎంఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించాలని కోరారు.

అదానీతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

● సీపీఎం రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అదానీ కంపెనీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సబబు కాదని విమర్శించారు. గత ప్రభుత్వ అవినీతిపై రంకెలు వేస్తూ ఇపుడు అదానీకి తలవంచడమేంటని ప్రశ్నించారు. అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే వాటిని రద్దు చేయాల్సిన అవసరముందన్నారు.

ఎస్టీటీ అభ్యర్థుల కోసం... డిసెంబరు 29న వదాన్య ప్రతిభాపరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్జీటీ అభ్యర్థులకు వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా నిరుపేద నిరుద్యోగ ప్రతిభావంతులైన అభ్యర్థుల అభ్యున్నతే లక్ష్యంగా వదాన్య సొసైటీ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రతి సంవత్సరం జిల్లా పరిషత్ పాఠశాలలోని 9,10 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలోనే ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని ఎస్జీటీ అభ్యర్థులకు డిసెంబరు 29న కొత్తచెరువు ప్రధాన కేంద్రంగా ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1500 మందిపైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30లోగా www.vada anya.org లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక రద్దు

గుంతకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం-కదిరిదేవరపల్లి రైల్వే స్టేషన్లలో యార్డు ఆధునికీకరణ పనుల కారణంగా తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు రైలును పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (నం. 07589) రైలును డిసెంబరు 1నుంచి 31 వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచినట్లు తెలియజేశారు. ఆ తేదీల్లో గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో మాత్రమే ఈ రైలు నడవనుంది. అలాగే దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07590) డిసెంబరు 2 నుంచి జనవరి 1వ తేదీ వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచి గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా సివిల్స్ స్ర్కీనింగ్ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు సంబంధించి బుధవారం నిర్వహించిన స్ర్కీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు మొత్తం 57 మంది దరఖాస్తు చేసుకున్న ట్లు అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 37, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 18 మంది అభ్యర్థు లు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల ను అనంత జిల్లా అభ్యర్థులకు ఒక గది లో... శ్రీసత్యసాయి జిల్లా అభ్యర్థులకు మరో గదిలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ పరిశీలించారు. ఉత్తీర్ణత సాధించిన వారికి విజయవాడలోని బీసీ భవన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారని ఆమె తెలిపారు. పరీక్షను శ్రీసత్యసాయి జిల్లా సూ పరింటెండెంట్ హరిత, ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ, వార్డెన్లు మారుతీ ప్రసాద్, రవీంద్రనాథ్ ఠాగూర్, మాధవి, స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ రవీంద్ర, లైబ్రేరియన్ శ్రీనివాసులు, సుబ్బయ్య, ప్రకాష్ తదితరులు పరిశీలించారు.

ఉండలేరు... పోలేరు..!

అసౌకర్యాల మధ్య ఆడపిల్లల చదువులు



ఆరుబయటే భోజనం తింటున్న విద్యార్థులు

- ఇరుకు గదుల్లో 20మంది విద్యార్థులు
- మొండి గోడల మధ్యనే భోజనాలు
- ఆగిపోయిన హాస్టల్ భవన నిర్మాణ పనులు
- పేదింటి బిడ్డలకు వసతి కష్టాలు
- దీనావస్థలో కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహం

అనంతపురం సెంట్రల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో సౌకర్యాలు లేక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది వసతి పొందాల్సిన దుస్థితి నెలకొంది. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో మొండి గోడల మధ్యనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. పలు ఇబ్బందులతో స్నానాలు చేయకుండానే తరగతికి వెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు వాపోతున్నారు.

ఐదేళ్లుగా మొండి గోడల మధ్యే...

విద్యార్థుల శ్రేయస్సు, భద్రతను దృష్టిలో పెట్టుకుని కళాశాల ఆవరణలోనే హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో పది గదులతో కూడిన భవనాన్ని నిర్మించి హాస్టల్‌ను ప్రారంభించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో గదులు సరిపోవడంలేదు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో యూజీసీ, రూసా తదితర నిధులను సమీకరించి కొత్తభవనాల నిర్మాణాలు చేపట్టారు. సెమినార్ హాల్, అదనపు తరగతి గదుల భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే హాస్టల్ కోసం నిర్మిస్తున్న భవనాలు పిల్లర్లు, గోడలు, స్లాబుల వరకు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాల్సి ఉండగా ఎన్నికలు రావడం, వైసీపీ అధికారాన్ని చేపట్టడంతో హాస్టల్ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా మొండి గోడలమధ్యనే విద్యార్థులు వసతి పొందుతూ, భోజనం చేస్తున్నారు.

ప్రైవేట్ హాస్టళ్లకు విద్యార్థులు...

కళాశాల హాస్టల్లో సరిపడా గదులు లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లకు వెళ్తున్నారు. అడ్మిషన్ సమయంలో ఏదో రకంగా హాస్టల్ ఫీజులు చెల్లించి చేరిపోయారు. అయితే ఇక్కడి పరిస్థితులు భరించలేక, కట్టిన ఫీజులు వెనక్కితీసుకుని ప్రైవేట్ హాస్టళ్లకు వెళ్తున్నారు. అయితే ప్రైవేట్ హాస్టళ్లలో భద్రతకు భరోసా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గత్యంతరం లేక బయటికి హాస్టల్లో చేర్పించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన భవనాలు నిర్మించాలని వేడుకుంటున్నారు.

ఒక్కో గదిలో 20 మంది..

కొత్త భవన నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో పాతభవనంలోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నాం. ఒక్కో గదిలో 20 మంది వరకు వసతి పొందుతున్నారు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవాలన్నా, స్నానాలు చేయాలన్నా గంటల కొద్దీ వేచిచూడాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. దీంతో వారంలో ఒకటి, రెండు సార్లు మాత్రమే స్నానాలు చేస్తున్నామని, ఒక్కోసారి మొహం కడుక్కోవడానికి సమయం సరిపోక ఆలస్యంగా తరగతికి వెళ్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క భవనంలోనే 600 మంది వరకు వసతి పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

1600 మంది విద్యార్థినులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలకు మంచి పేరుంది. ఇక్కడ డిగ్రీలో 15 రకాల కోర్సులు అందిస్తున్నారు. బాలికల ప్రత్యేక కళాశాలల కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల విద్యార్థినులు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా దాదాపు 600మంది అడ్మిషన్ అవుతున్నారు. మూడు సంవత్సరాలు డిగ్రీ కోర్సుల్లో కలిపి 1600 మంది విద్యార్థినులు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. వీరిలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. మరోవైపు సరిపడా తరగతి గదుల్లేక షిఫ్టులవారిగా పాఠాలు బోధిస్తున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు.

కాళ్లరిగేలా తిరిగినా..

తమ కళాశాలలో అడ్మిషన్స్ పెరిగాయని, సరిపడా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కళాశాల అధికారులు గత ప్రభుత్వానికి అనేక సార్లు మొరపెట్టుకున్నారు. అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవన నిర్మాణం పూర్తిచేయడానికి, అదనపు తరగతి భవనం నిర్మించేందుకు నిధులు ఇవ్వాలని ఐదేళ్ల కాళ్లరిగేలా జిల్లా అధికారుల చుట్టూ తిరిగారు. అయినా కళాశాల వైపు ఏ అధికారి చూడలేదు. దీంతో ఆర్డీటీ వంటి స్వచ్ఛంద సంస్థలు, సేవాగుణం కలిగిన వారిని ఆశ్రయించారు. అయితే అప్పటి పాలకులు వారిని సైతం ఆ కళాశాలవైపు రాకుండా నియంత్రించారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు



గోడలుకట్టి వదిలేసిన గదులు



అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలు. పిల్లర్లు, స్లాబులతో వదిలేసిన భవనాలు



గదుల పరిస్థితి ఇదీ..!



తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం: హాస్టల్ విద్యార్థి

హాస్టల్లో తగిన గదుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కళాశాల హాస్టల్ అయితే బాగుంటుందని, సెక్యూరిటీ ఉంటుందని చాలా మంది ఇక్కడికే వస్తున్నాం. ఒకే గదిలో 20మంది వరకు ఉంటున్నాం. అదనపు భవనాలున్నా వాటిని పూర్తిగా నిర్మించలేదు. కొన్ని గదులకు గోడలు నిర్మించారు. మరికొన్నింటిని అలానే వదిలేశారు. బట్టలు ఆరవేయడానికి, చదువుకోవడానికి వాటినే ఉపయోగిస్తున్నారు. వర్షం వస్తే మెస్‌హాల్లో భోజనం చేయడానికి లేదు. ప్రైవేట్ హాస్టల్లో సెక్యూరిటీ ఇబ్బంది ఉంటుందని ఇక్కడే ఉండిపోతున్నాం.

దాతల కోసం ఎదురుచూస్తున్నాం : సత్యలత, ప్రిన్సిపాల్, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

“ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కళాశాలలోనే హాస్టల్‌ను ఏర్పాటు చేశాం. అయితే సరిపడా భవనాలు, గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గదిలోనే 20మంది వరకు ఉంటున్నారు. వ్యక్తిగత అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నారు. అదనంగా నిర్మాణం తలపెట్టిన భవనం పూర్తికాలేదు. పిల్లర్లు, స్లాబుల వరకే పనులు అయ్యాయి. కొన్ని గదులకు గోడలు కట్టివదిలేశారు. మిగిలిన పనులు పూర్తిచేయడం కోసం ఆర్డీటీ, ఇతర దాతలను సాయం అడిగాం. కళాశాల పూర్వ విద్యార్థుల నిధుల నుంచి దాదాపు రూ.4లక్షల విలువగల పనులు చేయిస్తున్నాం. దాతలు ముందుకువచ్చి సాయం చేస్తే విద్యార్థుల భవిష్యత్తుకు చేయూతనిచ్చిన వారవుతారు.



ఏంటో ఈ విడ్డూరం..!

మూతపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు కొనుగోలు బాధ్యతలు



మూతపడిన ఆయిల్ ఫెడ్ జిల్లా కార్యాలయం

- మద్దతు ధరలేక నష్టపోతున్న వేరుశనగ రైతులు
- సమాచారం తెలిపినా స్పందించని రాష్ట్ర అధికారులు

అనంతపురం అర్బన్/ శింగనమల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో జిల్లా వేరుశనగ రైతులు నష్టపోతున్నారు. పండించిన వేరుశనగ పంటను మద్దతు ధరతో కొనేవారు కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా మద్దతు ధరతో రైతుల నుంచి వేరుశనగ కొనుగోలు బాధ్యతను ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థకు ఉన్నతాధికారులు అప్పగించేవారు. అయితే ఈ ఏడాది ఆయిల్‌ఫెడ్ సంస్థకు అప్పగించడం రైతులకు ఆశనిపాతమైంది. ఎందుకంటే ఈ సంస్థ జిల్లా కార్యకలాపాలు మానేసి మూడేళ్లు దాటింది. అయినా రాష్ట్ర ఉన్నతాధికారులు అనాలోచితంగా మూతపడిన సంస్థకు కొనుగోలు బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ సంస్థ జిల్లాలో మూతపడిన విషయం రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలిపినా ఇప్పటి దాకా స్పందించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో తక్కువ ధరకు వేరుశనగ పంటను అమ్ముకోవాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు.

అరకొర దిగుబడికి మద్దతు ధర ఏదీ?

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 7.9 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో 1.11 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జూలై మాసంలో ఆలస్యంగా వేరుశనగ పంట సాగు చేశారు. వేరుశనగ పంట కీలక సమయాలు పూత, ఊడలు దిగే సమయాల్లో వర్షం పడలేదు. దీంతో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు ఒక క్వింటా నుంచి 2 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అక్టోబరు నెలాఖరులోగా 70 శాతం పంట కోత పూర్తయ్యింది. ఈనెల రెండో వారంలోగా మిగతా పంట కోతలు పూర్తి చేశారు. ఈ సారి అరకొరగా పండిన వేరుశనగ పంటను కూడా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోతోంది. ప్రతి ఏడాది ఏపీ మార్క్‌ఫెడ్‌కు వేరుశనగ పంట ఉత్పత్తి కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. ఈ సారి ఆయిల్‌ఫెడ్ సంస్థకు అప్పగించారు. గత వైసీపీ సర్కాల్ సమయంలోనే జిల్లాలో ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని బంద్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఆ సంస్థ అధికారులు, సిబ్బంది ఉద్యోగ విరమణ చెందారు. అప్పటి నుంచి జిల్లాకు ఎవరినీ నియమించలేదు. ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని సైతం ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చేశారు. జిల్లాలో ఆయిల్ ఫెడ్ కార్యకలాపాలు లేకపోయినా వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు అనాలోచితంగా అదె సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏడాది వేరుశనగ కోతలు పూర్తి కాగానే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ఆరంభిస్తూ వస్తున్నారు. గతేడాది ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు మాసంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. అక్టోబరు నెలలో రైతుల నుంచి వేరుశనగను మద్దతు ధరతో కొనుగోలు చేశారు. ఈ సారి ఆయిల్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ బాధ్యతలు అప్పగించడంతో పాటు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ఏమిచేయలేని పరిస్థితిలో ఉండిపోయారు. వేరుశనగ పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఉమ్మడి జిల్లాలోని పలువురు రైతులు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులను సంప్రదించినట్లు సమాచారం. ఈ విషయాన్ని వారు రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటి దాకా ఆయిల్‌ఫెడ్‌కు బదులుగా తిరిగి ఏపీ మార్క్‌ఫెడ్‌కు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించలేదు.

మద్దతు ధర పెంచినా ప్రయోజనం శూన్యం

గతంతో పోలిస్తే ఈ సారి వేరుశనగ మద్దతు ధరను పెంచారు. ఈ ఏడాది వేరుశనగ క్వింటా కనీస మద్దతు ధర రూ.6783లుగా ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది వేరుశనగ మద్దత ధర రూ.6377 ఉంది. గతంతో పోలిస్తే ఈ సారి మద్దతు ధరను పెంచారు. అయినప్పటికీ జిల్లాలో మూడపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి ఎప్పటిలాగానే ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించి, మద్దతు ధరను కల్పించాల్సి ఉంది.

తక్కువ రేటుకే అమ్ముకున్నా



ఈ సారి 9 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. దిగుబడి తక్కువగా వచ్చింది. వారం రోజుల కిందట బస్తా (42 కిలోలు)వేరుశనగ రూ.2300తోను అమ్మేశా. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఉంటే మాకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. అరకొరగా పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మరింత నష్టపోయాం.

\- పరశురాం, సోదనపల్లి, శింగనమల మండలం

ఎదురుచూశా..



ఆరు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. 12 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. వేరుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ఎదురుచూశా. కనీసం వేరుశనగను కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటన కూడా ఇవ్వలేదు. దీంతో వారం రోజుల కిందట తక్కువ ధరకే వేరుశనగ అమ్మేశా.

\- శ్రీనివాసులు, చిన్న మట్ల గొంది, శింగనమల మండలం

మూతబడిన సంస్థకా బాధ్యతలు..?

జిల్లాలో మూతబడిన ఆయిల్ ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు ఎలా అప్పగిస్తారు..? రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆ మాత్రం కనీస సమాచారం తెలియకపోతే ఎలా. ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలతో జిల్లాలో కనీస మద్దతు ధరకు రైతులు దూరమయ్యారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఆయిల్ ఫెడ్ సంస్థ కార్యకలాపాలు చేయడం లేదని తెలిసిన తర్వాత కూడా ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణం. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకొని, మద్దతు ధరతో వేరుశనగ పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

\- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నేడు, రేపు కేంద్ర బృందం పర్యటన

డ్వామా పీడీ సలీం బాషా



మాట్లాడుతున్న డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్లు జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నారు. కేంద్ర వాణిజ్యశాఖ డైరెక్టర్, కేంద్రజలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ అరులానందన్, శాస్త్రవేత్త షరీఫ్‌ఖాన్‌లు జిల్లాలో ఉపాధి, వాటర్‌షెడ్‌లలో చేపడుతున్న పనులను గురు, శుక్రవారం పరిశీలించనున్నారు. కేంద్ర బృందం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై తన చాంబర్‌లో డ్వామా పీడీ సలీంబాషా ఏపీడీలు, ఏపీఓలతో సమీక్షించారు. ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాల అమలు తీరు, చేపట్టిన పనులను కేంద్రబృందం పరిశీలిస్తుందని పీడీ తెలిపారు. వాన నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు, మొక్కల పెంపకం, అటవీకరణ, వర్షం నీటి పునర్వినియోగం వంటి పనులను ప్రధానంగా పరిశీలిస్తారన్నారు. రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ప్రాంతాల్లో పర్యటిస్తారన్నారు. డ్వామా, అటవీశాఖ, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, అగ్రికల్చర్, భూగర్భజల శాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు, ఇంజనీర్లు కేంద్రబృందానికి చేపట్టిన పనులను వివరిస్తారన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన ఉపాధి, వాటర్‌షెడ్ పనులను, భవిష్యత్తులో జిల్లాలో చేపట్టే పనులపై చర్చిస్తారని తెలిపారు. సమావేశంలో వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీలు విజయ్‌కుమార్, అయేషా, అనురాధా, శైలజ, ఏపీఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉడేగోళాన్ని ఆదర్శంగా తీసుకోండి

ప్రజలకు కేంద్ర బృందం సూచన

కణేకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని 43 ఉడేగోళం గ్రామాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ కురుసి రిస్తా, కేకే జాలి పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి, మరుగుదొడ్లను పరిశీలించా రు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా 43 ఉడేగోళంలో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయడాన్ని ప్రశంసిం చారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ లావణ్యను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసు లు, జేఈ శివకృష్ణారెడ్డి, సర్పంచ్ లావణ్య, వైస్ సర్పంచ్ రామాంజ నేయులు, టీడీపీ నాయకులు మారుతి, అనిల్, శివశంకర్ పాల్గొన్నారు.



ఉడేగోళంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

రైతన్నకు యాప్ అండ


ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా తెగుళ్ల వివరాలు, నివారణ చర్యలు

అనంతపురం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) యాప్ ద్వారా పురుగు, తెగుళ్ల వివరాలు, వాటి నివారణ చర్యలు తెలుసుకోవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. స్థానిక రైతు శిక్షణా కేంద్రంలో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులకు ఎన్‌పీఎస్ఎస్, జాతీయ పురుగు నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాప్‌ను ఉపయోగించి పొలంలో పంటను ఫొటో తీస్తే ఆ పంటకు సోకిన తెగుళ్ళ, పాటించాల్సి నివారణ చర్యల వివరాలను అందజేస్తుందన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఎలా వినియోగించాలన్న విషయాలపై సీఐపీఎంసీ విజయవాడ కార్యాలయ ఆఫీస్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వీరయ్య చౌదరి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో డీడీఏ మద్దిలేటి, టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్ పాల్గొన్నారు.

బడి బాగుండాలని..!

ధర్మవరం మండలం చిగిచెర్ల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణను విద్యార్థులు శ్రమదానంతో శుభ్రం చేస్తున్నారు. బాలురు పారలు చేతబట్టి పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. బాలికలు పరకలతో చెత్తను ఊడ్చేస్తున్నారు. ఆటలకు అనువుగా గ్రౌండ్‌ను తీర్చి దిద్దుతున్నారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చూస్తున్నామని, శ్రమదానంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారని హెచ్ఎం తిమ్మారెడ్డి అన్నారు.

\- ఆంధ్రజ్యోతి, ధర్మవరం రూరల్



పారలు, పరకలు పట్టి పనులు చేస్తున్న విద్యార్థులు

పేపర్‌బ్యాలెట్ వ్యాజ్యం కొట్టివేత

- సుప్రీం తీర్పును వెల్లడించిన కలెక్టరు

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఈవీఎంలను తొలగించి పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశ పెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసినట్లు కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కోర్టు ఉత్తర్వుల సారాంశాన్ని కలెక్టరు బుధవారం ఓప్రకటనలో వెల్లడించారు. ఎన్నికలలో ఈవీఎంల ట్యాంపరింగ్‌పై కేఏపాల్ చేసిన వాదనలను న్యాయస్థానం కొట్టేసిందన్నారు. అదే సమయంలో ఎన్నికలలో ఓడిపోయినపుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిర వైఖరిని న్యాయస్థానం ఎత్తిచూపిందన్నారు. ఎన్నికలలో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయపార్టీలకు ఎలాంటి సంబంధం లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ.వరాలేలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టరు తెలిపారు.

క్రైం కార్నర్

భార్య గొంతుకోసి చంపిన భర్త


ఈశ్వరమ్మ (ఫైల్)

లేపాక్షి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను భర్త గొంతు కోసి, దారుణంగా హత్య చేశాడు. మండలంలోని కొండూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత గాఢ నిద్రలో ఉన్న ఈశ్వరమ్మ (35)ను ఆమె భర్త దళిత శంకర్ హత్య చేశాడు. తరువాత పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లేపాక్షికి చెందిన దళిత నారాయణప్ప కుమారుడు దళిత శంకర్‌కు కొండూరు గ్రామానికి చెందిన దళిత తిప్పన్న కుమార్తె ఈశ్వరమ్మతో 14ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. శంకర్ టైలర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ వారి మధ్య గొడవలు జరిగేవని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈశ్వరమ్మ అలిగి, పుట్టింటికి వెళ్లింది. శంకర్ మంగళవారం అత్తగారింటికి వెళ్లాడు. భార్యను బాగా చూసుకుంటాననీ, గొడవ పడనని చెప్పాడు. ఈశ్వరమ్మ కూడా సరే అంది. రాత్రి భోజనం చేసి భార్యాభర్తలు ఒకే గదిలో నిద్రించారు. మరో గదిలో అత్తమామలు పడుకున్నారు. గాఢ నిద్రలో ఉన్న ఈశ్వరమ్మను శంకర్ కత్తితో గొంతు కోసి, దారుణంగా హత్యచేశాడు. తరువాత లేపాక్షి స్టేషన్‌కు చేరుకున్నాడు. తన భార్యను చంపానని పోలీసుల ఎదుట లొంగిపోయాడు. వెంటనే పోలీసులు కొండూరుకు చేరుకున్నారు. అప్పుడు ఈశ్వర మ్మ తల్లిదండ్రులు మేల్కొన్నారు. ఈశ్వర మ్మ మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి, హిందూపురం ఆస్పత్రికి తరలించారు. హత్యపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. కూలీ మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

పెద్దపప్పూరు/నార్పల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నార్పల మండలంలోని నాయనపల్లి ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియన వాహనం ఢీకొనడంతో కొత్తపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కృష్ణమూర్తి (55) దుర్మరణం చెందాడు. కూలి పనిలో భాగంగా మొక్కజొన్న విత్తనాలు నాటేందుకు కొత్తపల్లి నుంచి వెంకటాంపల్లికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యంలో ప్రమాదం జరగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి అనారోగ్యం కారణంగా గతంలోనే మృతి చెందింది. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ వివాహాలు అయ్యాయి. మృతుడి కుమారుడు హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు నార్పలఎస్‌ఐ సాగర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

84 గ్రాములు బంగారం, 2.173 కేజీల వెండి, రూ.లక్ష స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు మరిగి, సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలముఠాను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 7.68 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు, లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కేసు ఛేదింపు వివరాలను ఎస్పీ రత్న వెల్లడించారు. అనంతపురం నగరానికి చెందిన షికారి కోటయ్య, షికారి షాలి అలియాస్ శ్యామ్, షికారి శీనా అలియాస్ అర్జున్ వ్యసనాలకు బానిసలయ్యారు. వాటిని తీర్చుకునేందుకు సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. అందుకు చోరీలను ఎంచుకున్నారు. పుట్టపర్తి, గోరంట్ల, కదిరి తదితర మండలాల్లో చోరీలు చేశారు. వీటిపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. చోరీలను జిల్లా పోలీసు అధికారులు సీరియస్‌గా పరిగణించారు. వాటిని ఛేదించేందుకు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, రూరల్ సీఐ సురేష్, ఎస్‌ఐ లింగన్న, సీసీఎస్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామచంద్రతో ప్రత్యేకబృందం ఏర్పాటు చేశారు. కేసుల దర్యాప్తులో భాగంగా నిందితులు ముగ్గురిని బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి నగలు, నగదు, చోరీలకు వాడిన మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

రివార్డులు: అంతర్ జిల్లా చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, ఎస్‌ఐ లింగన్న, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాంపు కష్టాలకు చెక్..!


ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- కూటమి సర్కారు నూతన విధానం
- ఆధార్ తప్పనిసరి చేస్తూ నిర్ణయం
- కృత్రిమ కొరత, నకిలీలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం

ధర్మవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూములు, ఆస్తుల క్రయవిక్రయాలకు వెళ్తే స్టాంపులు దొరక్క తిప్పలు పడాల్సి వస్తోంది. సరఫరా అయిన స్టాంపుల్లో కొందరు పెద్దమొత్తంలో కొనుగోలు చేసి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడీషియల్ స్టాంపు అమ్మకాల తీరును సంస్కరించేందుకు నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల విక్రయాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ-స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టి, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నాన్ జుడీషియల్ స్టాంపుల వైపే మొగ్గుచూపింది. ఇందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్దసంఖ్యలో స్టాంపులను తెప్పించి, అన్ని జిల్లాలకు సరఫరా చేసింది. నాన్ జుడీషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉండేది. ఆ తరువాత స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంపువెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. కొందరు వెండర్లు ఎక్కువ సంఖ్యలో స్టాంపులు కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయించే వారన్న విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యేవి. నకిలీస్టాంపులు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది.

లెక్క తెలిసిపోతుంది..

స్టాంపుల విక్రయాల్లో గతంలో మాదిరిగా చికార్డుల్లో రాసి స్టాంపులు ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. రిజిస్టర్లు, అకౌంట్ పుస్తకాలు కలిగి ఉండే స్టాంపు వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏయే స్టాంపులు, ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో విక్రయాలు తక్కువగా సాగే కార్యాలయాలనుంచి ఎక్కువ అవసరమైన వాటికి తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. కూటమి ప్రభుత్వ ఆలోచనపై హర్షం వ్యక్తమవుతోంది. స్టాంపు తీసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి చేయడంతో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోతుంది.

ఆధార్ తప్పని సరి..

ఒకటికన్నా ఎక్కువగా నాన్ జుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేసినా కొత్త విధానంలో మొత్తం వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. స్టాంపులు పొందడానికి ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆధార్ నంబరును కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంపులు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి 10 స్టాంపుల వరకూ కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నంబరు నమోదు చేయడం వల్ల ఎవరు, ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది.

అందుబాటులో స్టాంపులు



నాన్ జుడీషియల్ స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నంబరు నమోదు చేసుకుని, స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. స్టాంపు వెండర్లు నిబంధనలు తప్పక పాటించాలి.

- తాయన్న, సబ్‌రిజిస్ట్రార్, ధర్మవరం

వెదురుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- తొలిసారిగా రాయితీ వర్తింపు
- ఐదు ఎకరాల దాకా రూ.50 వేలు


గుమ్మఘట్ట మండలం గొల్లపల్లిలో వెదురు పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

అనంతపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెదురు సాగుకు రాయితీని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పొలాల్లో వెదురును పూర్తి పంటగా సాగు చేసుకోవచ్చు. గట్ల వెంబడి నాటుకుంటే ప్రధాన పంటతోపాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల దాకా వెదురు సాగుకు రాయితీని కల్పించారు. గరిష్ఠంగా రూ.50వేలు దాకా రాయితీని వర్తింపజేస్తారు. మొదటి సంవత్సరం రూ.25వేలు, రెండో సంవత్సరం రూ.15వేలు, మూడో సంవత్సరం రూ.10వేలు చొప్పున బతికి ఉన్న మొక్కల సంఖ్య ఆధారంగా అందజేయాలని నిర్ణయించారు. రెండో సంవత్సరం రాయితీ అందించాలంటే 80 శాతం మొక్కలు బతికి ఉండాలి. మూడో సంవత్సరం రాయితీ ఇవ్వాలంటే 100 శాతం మొక్కలు బతికి ఉండాలన్న షరతు విధించారు. గుంతలు తవ్వడానికి, మొక్కలు ఖరీదు, ఎరువులు, నీటి పాదరులకు కలిసి ఐదు ఎకరాలకు రూ.50వేలు రాయితీ వర్తింపజేస్తారు. పొలం మొత్తం వెదురు నాటుకోవాలంటే ఒక మొక్కకు మరో మొక్కకు వరుసకు, వరుసకు మధ్య 5 మీటర్ల దూరాన్ని పాటించాలి. ఇలా ఎకరాకు 160 మొక్కలు దాకా నాటుకోవచ్చు. గట్ల వెంబడి నాటుకోవాలంటే ఒక మొక్కకు మరో మొక్కకు 2 మీటర్ల దూరం ఉంటే సరిపోతుంది. జిల్లాలో ఎంత విస్తీర్ణానికైనా వెదురు సాగుకు సబ్సిడీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని గుమ్మఘట్ట మండల గొల్లపల్లిలో 7.5 ఎకరాల్లో పూర్తిగా వెదురు సాగవుతోంది. అలాగే గుంతకల్లు మండలం నక్కనదొడ్డిలో 7.5 ఎకరాల తోట చుట్టూ వెదురు సాగు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వెదురు సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీని వర్తింపజేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపయోగాలు....

వెదురుతో పలు రకాల పనిముట్లు తయారు చేస్తారు. ముఖ్యంగా ఫర్నిచర్, జ్యువెలరీ అగరబత్తి, తడికలు, నిచ్చెనలు, తయారు చేస్తారు. గృహ నిర్మాణం, కాగితం, దుస్తులు, ఔషధాలు, కళాత్మక వస్తువులు ఇలా అనేకం తయారు చేస్తారు. బ్యాంబూ షూట్స్‌ను ఆహారంగా తీసుకుంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో వెదురు సాగుకు రాయితీకి వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పొలంలో పూర్తి పంటగా (బ్లాక్ ప్లాంటేషన్) లేదా బౌండరీ ప్లాంటేషన్ పద్ధతిలోనూ వెదురు పంటను సాగు చేసుకోవచ్చు. జిల్లా రైతులు ఎల్లప్పుడూ కొత్త రకం పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మన వాతావరణ పరిస్థితులకు వెదురు సాగు అనుకూలం. రైతులెవరైనా వెదురు నర్సరీ ఏర్పాటు చేయాలనుకుంటే రూ.లక్ష దాకా రాయితీ కల్పిస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం స్థానిక రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

- నరసింహారావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

కర్ణాటకలో విద్యార్థి ఆత్మహత్య


తేజ (ఫైల్)

డీ.హీరేహాళ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని విజయనగరం జిల్లా కారిగనూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి డీ.హీరేహాళ్‌కి చెందిన విద్యార్థి తేజ(17) ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన రవి, భాగ్యమ్మ దంపతులు కూలిపని చేసుకుని జీవనం సాగిస్తూ ఉండేవారు. వీరికి ఇద్దరు కుమారులు. తేజ బళ్లారి వీరశైవ కాలేజీలో ఇంటర్ సెకెండియర్ చదువుతుండేవాడు. హుబ్లీలో పని ఉందని రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. అయితే మంగళవారం రాత్రి కర్ణాటకలోని కరిగనూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తేజ వద్ద లభించిన ఆధారాలతో రైల్వేపోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీనిపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని విమ్స్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగం చేయలేక బలవన్మరణం


సాయిప్రసాద్ (ఫైల్)

లేపాక్షి నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న సాయిప్రసాద్(24) తన ఇంట్లో ఫ్యాన్‌కు బుధవారం ఉరివేసుకున్నాడు. లేపాక్షికి చెందిన సాయిప్రసాద్ కార్ల తయారీ అనుబంధ సంస్థలో ఉద్యోగి. పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, మానేస్తానని తల్లిదండ్రులకు చెప్పేవాడు. మధ్యతరగతి జీవితం అని, సర్దుకుపోవాలని వారు సూచించారు. దీంతో దిక్కుతోచక ఉరి వేసుకున్నాడు. సాయి ప్రసాద్‌కు ఎనిమిది నెలల క్రితమే వివాహమైంది. ఇంతలోనే భర్త దూరం కావడంతో ఆమె కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

ఎందుకొచ్చిన ఉద్యోగం..?

- విధులను పట్టించుకోని వార్డెన్
- కూడేరు ఎస్సీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం
- మరుసటి రోజు ఆచూకీ లభ్యం
- శాఖాధికారులతో తండ్రి గొడవ..?
- ఆలస్యంగా వెలుగులోకి సంఘటన



కూడేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో ఉంటున్న ఎనిమిదో తరగతి విద్యార్థి అహరూన్ గత వారం అదృశ్యమయ్యాడు. హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లిన బాలుడు సాయంత్రం తిరిగి రాలేదు. ఈ విషయాన్ని హాస్టల్లోని విద్యార్థులు చెప్పేంత వరకూ కూడా వార్డెన్ పట్టించు కోలేదు. సాయంత్రం హాస్టల్‌లో విద్యార్థులు బయోమెట్రిక్ వేసే సమయంలో కూడా విద్యార్థి మిస్సింగ్ అయినట్లు గుర్తించలేదు. ఆ తరువాత కూడా విద్యార్థి కోసం గాలింపు చర్యలు చేపట్టకుండా సంబంధిత శాఖాధికారులు, తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించి మిన్నకుండిపోయాడు. అయితే పైఅధికారులు అప్రమత్తమై మరుసటి రోజు ఉదయం అనంతపురంలోని రైల్వేస్టేషన్‌లో ఆ విద్యార్థి ఉన్నట్లు గుర్తించి, పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే విద్యార్థి అహరూన్ తండ్రి జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయానికి వెళ్లి ఆ శాఖాధికారులతో గొడవకు దిగాడు. తమ కుమారుడి పర్యవేక్షణపై ఇంత నిర్లక్ష్యమా..? ఏదైనా జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారు..? రాత్రంతా మా కుమారుడు ఎన్ని ఇబ్బందులు పడుంటాడని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆ సమయంలో అధికారులు అతడికి సర్ది చెప్పి పంపించారు.

సెలవులో వెళ్లేందుకు వార్డెన్ యత్నం...

విద్యార్థి అదృశ్యం సమస్య నుంచి తప్పించుకునేందుకు కూడేరు హాస్టల్ వార్డెన్ సెలవులో వెళ్లేందుకు ప్రయత్నించినట్లు ఆ శాఖాధికారుల ద్వారా తెలిసింది. అయితే ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ శాఖాధికారులు సెలవు మంజూరు చేయనట్లు సమాచారం. ఆ హాస్టల్ వార్డెన్ ముందు నుంచి విధుల పట్ల అలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. హాస్టల్ విద్యార్థి అదృశ్యం వెనుక కారణాలు లేకపోలేదు. తప్పిపోయిన విద్యార్థికి, సహచర విద్యార్థులకు హాస్టల్‌లో గొడవలు జరిగినట్లు సమాచారం. అయితే విద్యార్థుల కదలికలు గమనించి ఏవైనా సమస్యలుంటే స్పందించి సర్దిచెప్పాల్సిన వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. అడ్మిషన్ల విషయంలోనూ ఆ వార్డెన్ అదే అలసత్వాన్ని వహిస్తున్నట్లు సమాచారం. హాస్టల్ కెపాసిటీ 100 మందికిపైగా ఉంది. కానీ 50 మందికి మించి ఉండటం లేదు. వార్డెన్ పట్టించుకోకపోవడం వల్లే అడ్మిషన్లు తక్కువగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. మరి ఆ శాఖలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీడీ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

అవయవదానంతో పునర్జన్మ

- ఐఎంఏ స్టేట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ హేమలత


డాక్టర్ హేమలతను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యాధులతో బాధపడుతూ, అవయవాలు లభించక దేశంలో రోజుకు 20మంది మరణిస్తున్నారని ఐఎంఏ స్టేట్ జాయింట్ సెక్రెటరీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఆవేదన వ్యక్తంచేశారు. అవయదానంతో దాతలు పునర్జన్మ పొందవచ్చునని ఆమె తెలిపారు. భారత అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జేఎన్‌టీయూ ఓటీపీఆర్‌ఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డైరెక్టర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. రక్తదానం, నేత్రదానం, దేహదానం, అవయవదానం గురించి వివరించారు. దాతలుగా చేరాలనుకునే వారు https://jeevandan.ap.gov.in/ లేదా https://notto.abdm.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మొబైల్‌లోనే జీవన్ దాన్, నోటో వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చునని తెలిపారు. హోమ్ పేజీ ఓపెన్ కాగానే ప్రతిజ్ఞ(ప్లెడ్జ్) కనబడుతుందన్నారు. అంగీకరిస్తూ టిక్‌మార్క్ పెట్టిన వారు సభ్యులుగా నమోదు అవుతారన్నారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్, ఇతర వివరాలను భర్తీచేయడంతో డోనార్స్‌గా రిజిస్టర్ అవుతారని వివరించారు. అనంతరం డాక్టర్ హేమలతను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీనాథ్, డీఆర్ దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓ లహరి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సీతామహాలక్ష్మి, అమర్నాథ్‌రెడ్డి, తిరుపాల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు

ఎందుకు కట్టినట్లు..?

కూడేరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.ఆరు లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను వాడకుండా వదిలేశారు. వివిధ పనులపై వచ్చే ప్రజలు, అక్కడ పని చేసే సిబ్బంది కోసం వీటిని నిర్మించారు. పనులన్నీ ఏడాది కిందటే పూర్తయ్యాయి. కానీ వీటిని వినియోగంలోకి తేలేదు. అధికారులు స్పందించి, లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లను వెంటనే వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- కూడేరు

ప్రమాదకరం..

- జీఎస్‌బీసీపై పాక్షికంగా కూలిన వంతెన
- రాళ్లు అడ్డుపెట్టి వదిలేసిన ఆర్‌అండ్‌బీ శాఖ


కూలిన వంతెన వద్ద అడ్డుపెట్టిన రాళ్లు

గుంతకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో గుత్తి సబ్ బ్రాంచ్ కాలువ (జీఎస్‌బీసీ)పై ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ జీఎస్‌బీసీ గుంతకల్లు పట్టణం గుండా వెళ్తోంది. ఆలూరు రోడ్డులో ఈ కాలువపై గల ఆర్‌అండ్‌బీ రహదారిపై వంతెనను నిర్మించారు. ఈ వంతెన నిర్వహణ సరిగా లేకపోవడంతో నాలుగు నెలల కిందట పాక్షికంగా కూలిపోయింది. పక్షం రోజుల కిందట కురిసిన వర్షాలకు వంతెన రక్షణ గోడ మరింత దెబ్బతింది. అత్యవసరంగా మరమ్మతు చేయాల్సిన ఈ వంతెన వద్ద ప్రమాదాలు జరక్కుండా పోలీసులు రాళ్లను, రెండు బారికేడ్లను అడ్డుగా ఉంచారు. రాళ్లపై తెల్లటి సున్నం చల్లారు. చర్యలు తీసుకోవాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఇక్కడ చాలా లోతులో కాలువ ఉన్నందున వాహనాలు అదుపుతప్పితే పెను ప్రమాదం జరిగే పరిస్థితులున్నాయి.

వంద అడుగుల లోతైన డీప్ కట్


వంతెన కింద వంద అడుగుల డీప్ కట్

ఆలూరు రోడ్డులో సీఐటీయూ కాలనీ వద్ద జీఎస్‌బీసీపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. నాలుగు నెలల కిందట ఈ వంతెనపై లోడు లారీ నిలపగా, పాక్షికంగా వంతెన, దాని రక్షణ గోడ కుంగిపోయి కింద ఉన్న కాలవలోకి పడిపోయాయి. లారీ కూడా పక్కకు ఒరిగి, అంచును తాకి బాలెన్సులో నిలిచిపోయింది. వెంటనే ఎక్స్‌కవేటరుతో లారీని పక్కకు లాగి ప్రమాదం జరగకుండా జాగ్రత్తపడ్డారు. కాగా ఈ వంతెన కింద ఉన్న జీఎస్‌బీసీ దాదాపు వంద అడుగుల డీప్ కట్‌లో ఉంది. ఈ డీప్ కట్ పూర్తిగా బండరాళ్లమయంగా ఉండటంతో వాహనాలు అదుపుతప్పితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆ నిధులతో సత్వరమే జీఎస్‌బీసీపై ఉన్న వంతెనకు మరమ్మతులు చేయించాల్సిన అవసరముంది.

అంతా మా ఇష్టం.!





- సమయపాలన లేని ప్రభుత్వ అధికారులు
- ఉదయం 11 గంటలైనా హాజరుకాని వైనం
- విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులు
- ఇబ్బందుల్లో ప్రజలు

ఆంధ్రజ్యోతి విజిట్

ఖాళీగా ఉన్న గ్రంథాలయం, సచివాలయం -2

నల్లచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొందరు ప్రభుత్వ అధికారులు సమయపాలనను ఏ మాత్రం పాటించడం లేదు. అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగేది ఎవరు.. అన్నట్లు విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో వారు ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. అధికారులు ఉదయం 11.30 గంటలైనా కార్యాలయాలకు రావడం లేదు. దీంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు వారి కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. కార్యాలయాల్లో సీసీ కెమెరాలు.. ఉన్నతాధికారుల తనిఖీలులేని కారణంగా... ఆ అధికారులు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా సాగుతోంది. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాల యం, గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.. అన్నీ ఒకే చోట ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో ఉదయం 11.30 గంటలైనా పలు కుర్చీలు ఖాళీగానే ఉంటాయి. మధ్యాహ్నం రెండు గంటలు దాటితే ఏ కార్యాలయాల్లో అధికారులు కనిపించరు. వివిధ పనులపై వచ్చే ప్రజలు వారి కోసం గంటల తరబడి నిరీక్షించి.. విసిగి.. వేసారి.. వెళ్లిపోతున్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న ఉపాధి సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండరు. కారణమడిగితే ఫీల్డ్ వెళ్లారని చెబుతుంటారు. ఫీల్డుకు వెళ్లిన తరువాత అయినా వారు కార్యాలయానికి రావడం లేదు. కూలీలు బిల్లుల విషయంపై కార్యాలయానికి వచ్చి.. అధికారులు వేచిచూసి.. వారు రాకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు.

ఇక గ్రంథాలయానికి అధికారి తాళం మాత్రం తీసి వెళ్లిపోతుంటారు. పాఠకులు వచ్చి.. వారికి కావాల్సిన పుస్తకాలు, పత్రికలు చదివి వెళ్తుంటారు. కనీసం అక్కడ సమాచారం ఇచ్చే వారు కూడా ఉండరు. గ్రంథాలయ అధికారి ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉంది. గ్రంథాలయ అధికారి కార్యాలయానికి రాకుండా తలుపులు తెరవడానికి ఓ వ్యక్తిని ఏర్పాటు చేసినట్లు ఆరోపణలున్నాయి.

సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదు. సచివాలయం-2 లో ఇద్దరు, ముగ్గురు తప్ప మిగిలినవారు హాజరుకారు. మండలంలోని 13 సచివాలయాల్లో ఇదే దుస్థితి.

గ్రంథాలయ అధికారిని చూడలేదు



నేను ప్రతిరోజా గ్రంథాలయానికి వస్తుంటాను. వివిధ పత్రికలు చదువుతుంటాను. ఏ రోజు గ్రంథాలయ అధికారిని చూడలేదు. ప్రతిరోజు గ్రంథాలయం తలుపులు తీసి ఉంటారు. ఇంతవరకు గ్రంథాలయ అధికారి ఎవరన్న విషయం నాకు తెలియదు.

-రెడ్డెప్ప, పాఠకుడు, రాగన్నగారిపల్లి



తలుపులు తెరవని ఉపాధి కార్యాలయం

న్యూస్ బాక్స్ ...

జాతీయస్థాయి పోటీలకు కిరణ్మయి

ధర్మవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలకత్తాలో ఈనెల 29 నుంచి నిర్వహించే 39వ యూత్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ధర్మవరం క్రీడాకారి కిరణ్మయి పాల్గొంటున్నారు. ఈ ఏడాది మే 21వ తేదీ నుంచి 24 వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరఫున పాల్గొన్న కిరణ్మయి జాతీయ జట్టుకు ఎంపికైంది.

వర్చువల్ సెమినార్‌లో ధర్మవరం విద్యార్థి ప్రతిభ



కొత్తచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ పొటెన్సియల్, కన్సర్న్ అనే అంశంపై ఈనెల 25న నిర్వహించిన వర్చువల్ సెమినార్‌లో ధర్మవరం మోడల్ స్కూల్‌కు చెందిన లక్ష్మీనివాస్ రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచాడని విద్యాశాఖ అధికారి కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆ విద్యార్థిని ప్రోత్సహించిన గైడ్ టీచర్ శ్రావణికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ కూడా విద్యార్థులను సైన్స్ ప్రయోగాల పట్ల అవగాహన కల్పిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

సీఎం దృష్టికి గిరిజన విద్యార్థుల సమస్యలు



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న అక్కులప్ప

ఓబుళదేవరచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లినట్లు విద్యార్థి సంఘం నాయకుడు కె. అక్కులప్ప నాయక్ తెలిపారు. బుధవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో సీఎంను కలిసి వినతి పత్రం అందజేసినట్లు చెప్పా రు. అలాగే గిరిజనులకు నామినేటె్ పదవులు కల్పించాలని, కేంద్రం నుంచి వచ్చే నిధులతో గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యం కల్పించాలని కోరామన్నారు.

భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు

పుట్టపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖకు చెందిన భూములను ఎవరైనా కబ్జాచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ శాఖ ఈఓ ఈశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కొట్లపల్లిలో కంచివరదరాజుల స్వామి భూమిని ఇతరులు కబ్జా చేశారని గ్రామస్థులు నాగిరెడ్డి, పవన్‌కుమార్, గోవర్దన్, నాగార్జున దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈఓ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి గుడిని, దేవదాయశాఖకు చెందిన సర్వేనెంబరు 191-1లోని భూమిని పరిశీలించారు. అక్కడ రైతులు చింత చెట్లను సైతం కొట్టేశారని రైతులు ఫిర్యాదు చేశారు. పక్క రైతులతో దేవదాయశాఖ భూమి జోలికి రావద్దంటూ రైతులకు ఈఓ సూచించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి హద్దులు వేయించాలని గ్రామస్థులకు సూచించారు.

భూవివాదం.. ఆర్డీఓ పరిశీలన

కదిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూమ వివాదంపై మల్లాపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మల్లాపల్లి పొలం సర్వేనెంబర్ 268కు సంబంధించి భూ వివాదంపై అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామంలో విచారించారు. అనంతరం మల్లాపల్లి సచివాలయం వద్ద గల శ్మశానవాటిక ఆక్రమణకు గురికాగా, ఎక్స్‌కవేటర్‌తో ముళ్లపొదలు తొలగించి, స్థలాన్ని సర్వే చేయించారు. పొలాలకు వెళ్లే రహదారి వివాదం కాగా, ఇరువురికి సర్ది చెప్పి రైతుల సమస్య పరిష్కరించారు. ఆమె వెంట ఎస్‌ఐ బాబు, మండల సర్వేయర్ తాతయ్య, ఆర్‌ఐ సోముశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శివానంద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలపై ర్యాలీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై బాలికలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అల్లాపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త స్వర్ణలత, గౌనిపల్లిలో షమీమ్ ఆధ్వర్యంలోనూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉన్న పేదలు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో బుధవారం హౌసింగ్ ఏఈ భార్గవి, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి అవాస్ యోజన కింద రూ.1.50 లక్ష, రాష్ట్ర వాటా కింద రూ.లక్ష, జాబ్‌కార్డ్ ఉంటే అదనంగా రూ.30 వేలు మొత్తం రూ.2.80 లక్షలను మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏఎస్‌ఐగా సత్యనారాయణ



నల్లమాడ , నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ ఏఎస్‌ఐగా ఉద్యోగోన్నతి పొందారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను సీఐ నరేంద్ర రెడ్డి అభినందించారు.

కొనసాగిన కార్మికుల సమ్మె



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ముదిగుబ్బ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీతాలు పెంచాలని, నియామక పత్రాలను అందజేయాలని పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె బుధవారమూ కొనసాగింది. సీఐటీయూ, సీపీఎం, పారిశుధ్య కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. మండల కేంద్రంలో పేరుకుపోయిన చెత్తను తొలగించడానికి పుట్టపర్తి నుంచి వచ్చిన మినీ జెస్సీ వాహనాన్ని ఆ కార్మికులు అడ్డుకున్నారు. ఆర్డర్ కాపీ అందజేసే వరకు పనులు జరగనీయమంటూ ఆ వాహనం ఎదుట బైఠాయించారు. డీఎల్‌పీఓ శివకుమార్ సీఐటీయూ, సీపీఎం నాయకులతో మాట్లాడారు. 22 మంది కాంట్రాక్టు సిబ్బంది ఆర్డర్ కాపీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అయినా ఆ ఆర్డర్ కాపీలు తమ చేతికి అందేవరకూ సమ్మె విరమించే ప్రసక్తే లేదని కార్మికులు తెల్చిచెప్పడంతో ఆ అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేశ్, అవాజ్ కమిటీ నాయకులు బాబ్‌జాన్, నౌషాద్, పోతులయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించండి

ఓబుళదేవరచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హోటల్ నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లను అతిగా వినియోగిస్తున్నారని, వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు.. ఈఓఆర్డీ కేశవరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌ఎంపీ హరిక్రిష్ణ, మండలాధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా యువజన సెకటరీ సురేష్‌బాబు, నాయకులు ఉన్నారు.

పాఠశాలలో వైద్య పరీక్షలు

ఆర్‌బీఎస్‌కే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక

తనకల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమం కింద ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమం కింద పాఠశాలలో చదువుతున్న 375 మంది బాల, బాలికలకు 20 రకాల ఆరోగ్య పరీక్షలను వైద్య సిబ్బంది మూడు రోజులుగా నిర్వహిస్తోందన్నారు. చెవుడు, మూగ, అంధత్వం, శ్వాసకోశ, రక్తహీనత, ఎత్తు, బరువు, ఛాతి కొలతలు ఇలా వివిధరకాల పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్య సురక్ష పుస్తకాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పాఠశాలలో పలువురు విద్యార్థులకు పరీక్షలు చేసి, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీఓ నాగమల్లిక, మమత, హెల్త్ అసిస్టెంట్లు ముసలిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఆశకార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేరాల అదుపుపై దృష్టి సారించండి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై దృష్టి పెట్టాలని ఎస్పీ వీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారి నేరసమీక్ష సమావే శంలో ఎస్పీ మాట్లాడారు. ప్రతిఒక్కరూ సమష్టి జిల్లాలో ప్రశాంతత నెలకొల్పేలా కృషి చేయాలన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమ సేవలు అందించిన 24 మంది పోలీసులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, కేవీ మహేష్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

కదిరి సీఐ నారాయణరెడ్డికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ



జనసేన పార్టీలో చేరిక

ధర్మవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులకు చెందిన 20 కుటుంబాల సభ్యులు జనసేన పార్టీలో చేరారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో జుట్టూరు వెంకటేశ్, రవికుమార్, నరసింహ, జి.వెంకటేశ్, ఆదిశేషు, అశోక్, రాజేంద్ర ఉన్నారు.

మలేరియా నివారణాధికారి పర్యటన

ధర్మవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా అధికారి ఓబులు స్థానిక శారదానగర్, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను పరిశీలించి.. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్, ఎంపీహెచ్‌ఈఓ గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమేశ్ ఉన్నారు.

రైతులకు శిక్షణ

నల్లమాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రం-3లో రైతులకు శాస్త్రవేత్త అనిత బుధవారం శిక్షణ ఇచ్చారు. కె-6 రకం కంటే ఎక్కువ దిగుబడినిచ్చే కదిరి లేపాక్షి వేరుశనగ విత్తనాలనే సాగుచేయాలన్నారు. ఎరువుల యజమాన్యం, జిప్సమ్ ఆవశ్యకతను వివరించారు. ఈ సమావేశంలో ఏఓ సుమతి, శాస్త్రవేత్త భాస్కర్‌రెడ్డి నరసింహులు, విస్తరణాధికారి రంగాచారి, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

తక్కువ ఎత్తులో వేలాడుతున్న వైనం - పట్టించుకోని అధికారులు



గురుకుల పాఠశాల వైపు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

నల్లమాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో వేలాడు తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పాత సినిమా టెంట్ సమీపంలోని కేశవరెడ్డి ఇంటి వెనుక భాగంలోని కాలనీల్లో విద్యుత్ తీగలు చాలా కిందగా వేలాడు తున్నాయి. అంతేకాకుండా అక్కడి పెద్ద చింత మాను కొమ్మల్లో నుంచి విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. గాలివాన వచ్చినప్పుడు ఆ కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతూ ఉంటాయి. వర్షం వచ్చినప్పుడు ఆ చింతమాను ద్వారా విద్యుత్ ప్రవహించే ప్రమాదముంది. మేదర్ శేషప్ప ఇంటికెళ్లే చోట, గురుకుల పాఠశాలకు వెళ్లే విద్యుత్ తీగలు, వరలక్ష్మీ హోటల్ పక్క వీధిలో, చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతు న్నాయి. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్లు కిందనే ఉండడంతో పశువులు, గొర్రెలు, మేకలు వాటి వద్దకు వెళ్లి విద్యుదాఘాతంతో మరణించే ప్రమాదముంది. పలు గ్రామాల్లో బోరుబావుల వద్ద విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో వేలాడు తున్నాయి.

దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి పలిగిపోయి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.





చింతమాను నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు, తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యుత్ తీగలు

అర్హులందరికీ ఇళ్లు: ఎమ్మెల్యే

కదిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికి ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహ పథకం కింద ఇంటిస్థలం ఉండి.. ఇళ్లు నిర్మించుకునేవారందరికి ఇళ్లు కట్టిస్తామని అన్నారు. సొంత ఇంటి స్థలంతో పాటు రేషన్‌కార్డు కలిగి ఉండి, అర్హులైతే ఇళ్లు నిర్మించుకోవచ్చన్నారు. దీని కోసం గ్రామ, వార్డు స్థాయిల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అదే సమయంలో అక్రమాలకు పాల్పడితే ఎవరిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ టీడీపీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

● అనధికార లేఅవుట్లపై చర్యలు

లేఅవుట్లు అనుమతి లేకుండా ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులకు రిజిస్ట్రేషన్లు జరగవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డాక్యుమెంట్ రైటర్లు, సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో అనుమతి లేని లేఅవుట్లకు రిజిస్ట్రేషన్ చేయకూడదన్నారు. అక్రమాలకు పాల్పడే అధికారులునైనా వదలబోమని హెచ్చరించారు.

● ముగిసిన యువ ఉత్సవ్

కదిరి అర్బన్: స్థానికంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి యువ ఉత్సవ్ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో యువతకు సైన్సు మేళా, యంగ్ రైటర్స్, ఫొటోగ్రఫీ, ఆర్ట్స్ తదితర వాటిపై పోటీలు నిర్వహించారు. ప్రతిభకనబరచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు.

● ఎమ్మెల్యేకు సన్మానం

కదిరి లీగల్ : కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ను స్థానిక న్యాయవాదులు సన్మానించారు. బుధవారం ఆయన కార్యాలయంలో న్యాయవాదులు కోహినూర్ రవూఫ్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, అంబటి శివప్రసాద్ రెడ్డప్ప, హనమంతు సన్మానించిన వారిలో ఉన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కదిరి న్యాయవాదులు

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కుళ్లాయప్ప (ఫైల్)

పుట్టపర్తి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో నిడి మామిడి వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన బోయకిష్టప్ప కుమారుడు కుళ్లాయప్ప (29) బుధవారం మరణించాడు. ఇతను బూదలి వద్దనున్న కియ అనుబంధ సంస్థలో పనిచేసేవాడు. మంగళవారం రాత్రి విధుల అనంతరం బుధవారం ఉదయాన్నే శెట్టిపల్లికి బైక్‌పై బయలుదేరాడు. నిడిమామిడి సాయిబాబా దేవాలయం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా అతని బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ కుళ్లాయప్పను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మరణించాడని పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ లింగన్న తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

కారు బోల్తా



నంబులపూలకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని పవర్‌గ్రిడ్ వాటర్ ప్లాంటు వద్ద బుధవారం తెల్లవారు జామున అదుపు తప్పి కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. కడపకు చెందిన మల్లికార్జున, స్నేహితుడుతో కలిసి కదిరికి కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వలీబాషా పరిశీలించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ముదిగుబ్బ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడ్ని ముదిగుబ్బ పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ధర్మవరంరూరల్ మండలం నేటకోట గ్రామానికి చెందిన గోపాల్‌నాయక్ కుమారుడు చరణ్‌నాయక్ ధర్మవరంలోని బీఎస్‌ఆర్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. అతను తప్పిపోయి బుధవారం ముదిగుబ్బ రైల్వేస్టేషన్‌లో ఉండగా... అనుమానం వచ్చిన పోలీసులు ఆరాతీశారు. అతని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌లో ఆ బాలుడిని తల్లిదండ్రులకు సీఐ శివరాముడు అప్పగించాడు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

అధికారుల తీరుపై మండిపడిన సభ్యులు



సమస్యపై నిలదీస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించనప్పుడు ఈ సమావేశాలను నిర్వహించడం ఎందుకని వెంకటాపురం ఎంపీటీసీ బోయముతక శ్రీనివాసులు అధి కారుల తీరుపై ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీపీ తుమ్మల పర్వీన్‌షామీర్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అపార్‌లో భాగంగా జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు ఆధార్, మీసేవ కేంద్రాల్లో అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, అధికారులు ఎందుకు ఆ కేంద్రాలు తనిఖీ చేయలేదని నిలదీశారు. ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, తహసీల్దార్ అనంతాచారి మాట్లాడుతూ.. అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వాటిపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని అన్నారు. అఫిడవిట్ నిబంధన ఇతర ప్రాంతాల్లో లేదని, ఇక్కడ కూడా లేకుండా చూడాలన్నారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ రామక్రిష్ణ, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, జడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, వెలుగు ఏపీ రవీంద్ర, ఐసీడీఎస్ విజయకుమారి, హెచ్ఓ లావణ్య, ఎంఈఓ రమణ, పశువైద్యులు పాల్గొన్నారు.

పనిదినాలు పెంచకపోతే చర్యలు

ఓబుళదేవరచెరువు: ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచకపోతే చర్యలు తప్పవని ఏపీడీ జ్యోతి హెచ్చరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మినీగోకులాల మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. హార్టికల్చర్ మంజూరైన రైతుల పొలాల్లో గుంతలు తీయడం.. మొక్కలు నాటడం పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏపీడీ సహాయకులు ప్రతాప్‌రెడ్డి, ఈసీ ఆంజనేయులు, సాంకేతిక, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను నియమించండి

తనకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంను నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న మహమ్మద్‌ఖాదర్‌వలీ ఇన్‌చార్జి ఎంఈఓగా పుట్టపర్తికి వెళ్లారు. తనకల్లుకు రెగ్యులర్ హెచ్‌ఎం అయినా.. ఆయన పుట్టపర్తిలోనే ఉంటున్నారు. స్థానికంగా హెచ్‌ఎం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే హెచ్‌ఎంను నియమించాలని కోరుతున్నారు.

న్యూస్‌బాక్స్

108లో ప్రసవం - తల్లీబిడ్డ క్షేమం



108లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన సంధ్య

పెనుకొండ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో గర్భవతిని ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన సంధ్యకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు కాల్ చేశారు. ఆమెను శెట్టిపల్లి నుంచి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే బుధవారం ఉదయం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సిబ్బంది వీరిని అనంతపురం సర్వజనఆసుపత్రికి తరలించారు.

అన్నదానం కోసం రూ.లక్ష విరాళం



అన్నదానం కోసం విరాళం అందిస్తున్న ఓబులమ్మ

గోరంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దామరవొడ్డు శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మాలదారుల అన్నదానం కోసం బుధవారం ఓబుళమ్మ రూ.లక్ష విరాళం అందించారు. మండలంలోని బుడిదగడ్డపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు శేషాద్రిరెడ్డి తన తండ్రి జయచంద్రారెడ్డి జ్ఞాపకార్థం తల్లి ఓబులమ్మ చేతుల మీదుగా విరాళం మొత్తం ఆలయ కమిటీకి అప్పగించారు. గురుస్వామి రుషేంద్ర, కమిటీ సభ్యులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పలు దాతలను సత్కరించి అభినందించారు.

అయ్యప్ప మాలాధారులకు అన్నదానం

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల ధరించిన భక్తులకు గురుస్వామి పూల నరసింహప్ప ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నందు మాలాధారులకు అన్నదానం(భిక్ష) ప్రారంభించారు. దీక్ష కాలంలో మాల ధరించిన అయ్యప్పలకు జనవరి 6వరకు మధ్యాహ్నం అన్నప్రసాదం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆధార్ లింకేజీ కోసం క్యూ

హిందూపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమపథకాలు పరుగులు పెట్టిస్తుండటంతో ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్, ఫోన్‌నంబరు, బ్యాంక్ లింకేజీల కోసం కార్యాలయాలవద్ద క్యూ కడుతున్నారు. హిందూ పురంలో హెడ్ పోస్టాఫీసులో ఎన్‌పీసీఐ ఖాతా కోసం, ఆధార్‌సీడింగ్ కోసం పరుగులు తీస్తున్నారు. ఉదయం 7గంటలకే పోస్టాఫీసువద్ద క్యూలో ఉండగా మరోవైపు ఉచిత గ్యాస్ సిలెండర్ కోసం నమోదు చేసుకునేందుకు గ్యాస్ సిలెండర్ల ఏజెన్సీలవద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు జనం కిక్కిరుస్తున్నారు. దీంతో పాటు ఆధార్‌లో తప్పొప్పులు సరిదిద్దుకునేందుకు మీసేవ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంవద్ద కూడా జనం పోటెత్తుతున్నారు.

గంజాయితో యువత గిజగిజ



● చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి
● బానిసవుతున్న యువత ● ఆందోళనలో స్థానికులు

సోమందేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు సోమందేపల్లి మండలకేంద్రంలో చాపకింద నీరులా జోరుగా సాగుతున్నాయి. మత్తుకు బానిసైన యువత అసాంఘిక కార్యకలాపాలవైపు మొగ్గు చూపుతున్నారు. స్థానికంగా ఉండే మహిళలను వేధిస్తూ చెలరేగిపోతున్నారు. భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాల్సిన వయసులో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్థానికులు, తల్లిదండ్రులు వీరి ఆకృత్యాలు భరించలేక అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమందేపల్లిలోని సాయి నగర్, మారుతినగర్, స్నేహలతనగర్, శివనగర్, నక్కలగుట్ట కాలనీలో గంజాయి సేవిస్తున్న పలువురు యువకులను గత నెలలో పోలీసులు అదుపులోతీసుకున్నారు.



యువకులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు (ఫైల్)

వారి తల్లిదండ్రులు, యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయినా వారిలో పరివర్తన రాలేదని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల సాయినగర్‌లో సీసీ రోడ్డు పరిశీలనకు వచ్చిన మంత్రి సవితకు కాలనీ ప్రజలు గంజాయి సేవిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న యువతపై చర్యలు తీసుకోవాలని కోరడంతో దీనిపై ఆగ్రహించిన మంత్రి వెంటనే చర్యలను తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

గంజాయి మత్తుకు అలవాటుపడిన యువత హిందూపురం నుంచి ప్యాకెట్ రూ.300నుంచి రూ.500కు కొనుగోలు చేసి సోమందేపల్లికి తీసుకొస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలా తెచ్చిన గంజాయిని పేపర్లలో చుట్టి తాగడం, సిగరెట్‌లో పొగాకును సగం తొలగించి అందులో నింపి సేవిస్తున్నారు. అదేవిధంగా కొంత మంది స్థానికంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గంజాయి సేవించి మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రభుత్వ పాఠశాలలు, రచ్చకట్టలవద్ద గుంపులుగా చేరి గంజాయి సేవిస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. మత్తులో వారు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితిలో యువత ఆగడాలకు అంతులేకుండా పోతోందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల శివనగర్‌లో గంజాయి మత్తులో సొంతింటిపైనే రాళ్లు రువ్విన కొడుకును తండ్రి స్వయంగా పోలీసులకు అప్పగించిన సంఘటన విదితమే. అదేవిధంగా నక్కలగుట్ట కాలనీలో కొంతమంది కంపచెట్ల మాటున గంజాయి మొక్కలు పెంచుతున్నారన్న సమాచారంతో పోలీసులు వారిని విచారిస్తున్నారు.

గతంలో నేరుగా విక్రయాలు

గతంలో ఒడిస్సాకు చెందిన కొందరు హిందూపురంలో నివాసముంటూ సోమందేపల్లికి వచ్చి నేరుగా గంజాయి విక్రయాలు జరిపేవారు. ఈ యేడాది జూలైలో పోలీసులు ఒడిస్సారాష్ట్రం బాలంగిరి జిల్లాకు చెందిన పింటునాయక్, బలరాంలను అదుపులోకి తీసుకుని 1.13కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదుచేసి జైలుకు పంపారు. అప్పటి నుంచి గంజాయి విక్రయాలు కొనుగోళ్లు కొంతకాలం సద్దుమణిగాయి. అయితే అలవాటుపడ్డ యువకులు నేరుగా విక్రేతలవద్దకే వెళ్లి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఎనిమిది మంది యువకులు, వారి తల్లిదండ్రులనుపిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వీరి ఆగడాలను భరించలేక, గంజాయిబారి నుంచి తమ బిడ్డలను కాపాడాలని జనం మొరపెట్టుకుంటున్నారు.

చికిత్స తప్పనిసరి

గంజాయి డ్రగ్ ఆల్కహాల్ మాదిరి ఓ వ్యసనం. ఇలాంటి వాటికి బానిసైన వారిని మానసిక వ్యాధినిపుణులకు చూపించాలి. వారు డీఅడిక్షన్, రీహ్యాబిటేషన్ సెంటర్లలో కౌన్సిలింగ్, థెరపి ద్వారా చికిత్స చేస్తారు. కావున గంజాయి కేసుల్లో యువతకు మానసిక చికిత్స ఇప్పించడం అవసరం.



డా.హరికుమార్
వైద్యాధికారి

యువత పెడదారి పట్టకుండా చూసుకోవాలి

గంజాయి విక్రయిస్తూ లేదా సేవిస్తూ పట్టుబడితే ఎవరినీ వదలం. యువత పెడదారి పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. డాక్టర్లతో చికిత్స ఇప్పించడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలి.



రమేష్, ఎస్ఐ

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి విరాళం

అమరాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి కావల్సిన ఇనుమును అందించిన మడకశిర శాసన సభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్ ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ఎస్సీసెల్ తరపున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణానికి సాయం అడగగానే కావాల్సిన రూ.1.10లక్షల విలువచేసే సిమెంటు, ఇనుమును అందించి వారు అంబేడ్కర్‌పై తమకున్న అంకిత భావాన్ని చాటుకొన్నారన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ సర్పంచు విశ్వేశ్వర, అగ్రహారం నవీన్‌కుమార్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణానికి అందించిన ఇనుము

నకిలీ ఎరువుల దుకాణాల సీజ్

పావగడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పావగడ తాలూకాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం బ్రాండ్ లేకుండా కొన్ని నకిలీ మందులు, ఎరువులను రైతులకు అక్రమంగా అమ్ముతున్నారన్న సమాచారం అందుకొన్న జిల్లా విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారి బుధవారం నాగలమడకలోని ఎస్ఆర్.ఎంటర్‌ప్రైజెస్ దుకాణాన్ని నోటీసులు ఇచ్చి సీజ్ చేశారు. ఈదుకాణంలో 4.5 లీటర్ల హైదరాబాద్ కంపెనీకి చెందిన రూ.25వేలు విలువ చేసే ఆస్కర్‌క్రైఫికర్, బెల్లిట్ మందులను ఎలాంటి అనుమతులు లేకుండా రైతులు అమ్ముతున్నారని, ఆయన తెలిపారు. దీంతో దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

చేపల చెరువు వేలం

గుడిబండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.సి.గిరి పంచాయతీ గ్రామంలో సి.సి.గిరి చెరువు, బైరేపల్లి చేపల చెరువులను బుధవారం ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో వేలం వేయగా పి.సి.గిరి చెరువు రూ.41వేలకు కె.టి.యంజారేగౌడ్‌కు, అదే గ్రామానికి చెందిన హనుమంతేగౌడ్ బైరేపల్లి చెరువును రూ.90లకు వేలంపాటలో దక్కించుకొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కుళ్లాయప్ప

పుట్టపర్తిరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలో నిడిమామిడి వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన బోయకిష్టప్ప కుమారుడు కుళ్లాయప్ప (29) బుధవారం మరణించాడు. అతడు బూదలి వద్దనున్న కియా అనుబంధ సంస్థలో పనిచేసేవాడు. మంగళవారం రాత్రి విధుల అనంతరం బుధవారం ఉదయాన్నే శెట్టిపల్లికి బైక్‌పై బయలుదేరాడు. నిడిమామిడి సాయిబాబా దేవాలయం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా అతని బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ కుళ్లాయప్పను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మరణించాడని పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేశ్వర్‌రావు

పెనుకొండ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన దిగువంటికిష్టప్ప కుమారుడు కుళ్లాయప్ప(29) మరణించిన విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దయ్య, శ్రీరాములుయాదవ్, మైనార్టీ యువనాయకుడు దాదు, సర్పంచ్ శ్రీనివాసులు ఉన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

హిందూపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి మంజూరయ్యే నిదులను సక్రమంగా వినియోగించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద హిందూపురం పట్టణంలోని 38వార్డుకు సంబంధించి 42సచివాలయాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు సచివాలయ ఉద్యోగులు నిర్వహించిన ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో హిందూపురానికి భారీగా నిధులు వస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరులో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేష్, మంజుళ, అంజలి, ఇర్షాద్, సతీష్, మల్లికార్జున, రహమత్‌బీ, మాజీ మునిసిపల్ చైర్మన్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

అమరాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని హాలుకూరు, నిద్రగట్ట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపుపై హాలుకూరు, నిద్రగట్ట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధి హామీ ఏపీఓ జగదీష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ గంగప్ప, సర్పంచులు హనుమక్క, రాధమ్మ లోకేష్, గ్రామ కార్యదర్శులు ఈరన్న, గౌరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నరసింహమూర్తి, ఓంకార్‌లు పాల్గొన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ గంగప్ప మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు పనులు పూర్తి అయిన కూలీలు ఇంటిలో చదువుకొన్న, చదువుతున్న యువతీయువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను ప్రభుత్వమే కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు.

భారీగా కర్నాటక మద్యం స్వాధీనం

హిందూపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్ పోలీసులు దాడిచేశారు. ఈ దాడుల్లో భారీగా కర్నాటక మద్యం పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు కొల్లకుంటకు చెందిన వడ్డె నరసింహమూర్తి ఇంటిలో వడ్డె మంజునాథ్ అనే వ్యక్తి కొంత కాలంగా కర్నాటక మద్యాన్ని డంప్‌చేసి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఎస్ఐలు, సిబ్బందితో తనిఖీలు నిర్వహించడానికి వెళ్లగా గమనించిన వారు ఇంటికి తాళాలువేసి వెళ్లిపోయారు. దీంతో వీఆర్ఓ రవితేజని పిలిపించి ఇంటి తాళాలు పగలకొట్టి ఇంటిలో పరిశీలించగా కర్నాటకకు చెందిన 13బాక్సులు మద్యం దొరికింది. దీనివిలువ సుమారు రూ.80వేలు ఉంటుందన్నారు. మంజునాథ్‌పై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నాయని ఇతనిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేయడానికి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. వీరిపై కేసు నమోదుచేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫారూక్, సిబ్బంది నరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శాసన కోట గ్రామానికి చెందిన ఎం. రిజ్వాన్‌బాషా (41) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు రిజ్వాన్ మద్యానికి బానిసై మద్యం తాగడానికి డబ్బుకోసం భార్యతో తరచూ గొడవపడేవాడన్నారు. మంగళవారం భార్య కుటుంబ పోషణ కోసం కూలి పనికి వెళ్లిన సమయంలో స్వగృహంలో మనస్థాపానికి గురైన రిజ్వాన్‌బాష ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

భూ వివాదంపై ఆర్డీవో పరిశీలన

గోరంట్ల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలో భూ వివాదంపై మల్లాపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మల్లాపల్లి పొలం సర్వేనెంబర్ 268కు సంబంధించి భూవివాదంపై రెవిన్యూ అధికారులతో కలిసి గ్రామంలో విచారించారు. అనంతరం మల్లాపల్లి సచివాలయం వద్ద గల శ్మశానవాటిక ఆక్రమణకు గురికాగా, ఎక్సకవేటర్‌తో ముళ్లపొదలు తొలగించి, స్థలాన్ని సర్వే చేయించారు. పొలాలకు వెళ్లే రహదారి వివాదం కాగా, ఇరువురికి సర్ది చెప్పారు.

విస్తృతంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

మడకశిరటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు బుధవారం హోటళ్లు, టీస్టాళ్లను తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారిణి తస్లిమాబాను, సిబ్బంది హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పద్మశ్రీ హోటల్‌లో పరిశుభ్రత లేదని, వెంటనే 14 రోజుల్లోపు వంటగదిని మార్పు చేయాలని, వంటలకు వాడే వంటనూనెను ఒక్కసారి మాత్రమే వాడాలని, వాటిని మరలా ఉపయోగించరాదని పలు సూచనలు చేశారు. పలు దుకాణాలకు లైసెన్సులు లేకుండా నడుపుతున్నారని వారికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సూచనలు పాటించకపోతే ఆరునెలల శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిరటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై అవగాహన పెంపొందించుకోవాలని, బాల్యవివాహాలు చట్టరీత్యానేరం అని మడకశిర జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం బాల్‌వివాహ ముక్తిభారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగళి మండలం ఎమ్మిగనూరు జిల్లాపరిషత్ పాఠశాలలో కూడా విద్యార్థులకు బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. మడకశిర మండలంలోని గౌడనహళ్ళిసిద్దిగిరి ఉన్నత పాఠశాలల్లో బుధవారం శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనూ, రొళ్ల ఎంపీడీఓ కార్యాలయం ముందు బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

బాల్యవివాహాలతో నష్టాలు

హిందూపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల అనేక కష్టనష్టాలు జరుగుతాయని రినౌండ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరెస్పాండెంట్ ముస్తాఫా పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు.

30న నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం

మడకశిరటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 30వతేదీన నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త అవసరం: సీఐ

మడకశిరటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల జాగ్రత్త అవసరమని సీఐ రాజ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు పెరిగిపోయాయన్నారు. ఫొటో మార్ఫింగ్, రీల్స్ చేసి, ఇతరులకు షేర్ చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కిరణ్మయి

ధర్మవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కలకత్తాలో ఈనెల 29 నుంచి నిర్వహించే 39వ యూత్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ధర్మవరం క్రీడాకారి కిరణ్మయి పాల్గొంటున్నారు. ఈ ఏడాది మే 21వ తేదీ నుంచి 24 వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరపున పాల్గొన్న కిరణ్మయి జాతీయ జట్టుకు ఎంపికైంది.